

11న చిత్రలేఖన పోటీలు

చెన్నూరు : బాల బాలికల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈనెల 11న కడప నగరంలోని ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు బాలోత్సవం కన్వీనింగ్ కమిటీ సభ్యులు బి. లక్ష్మీరాజ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థుల్లో కళల పట్ల ఆసక్తి పెంపొందించడానికి పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. కడప ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో 11న ఉదయం 10 గంటల నుంచి 12 వరకు ఉంటాయన్నారు. ఎస్‌వి పిఇ ప్రభాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్‌రెడ్డి పోటీలు ప్రారంభిస్తారన్నారు. బాల్యంలో అందమైన తీపి జ్ఞాపకం మిగిలిపోయేలా కడప బాలోత్సవం పనిచేస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు మానసిక ఉల్లాసం కలిగించే చిత్రలేఖనం వంటి కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉందన్నారు. పాఠశాల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యాసంస్థల బంద్

'ఉక్కు' ఏర్పాటే ధ్యేయం
ఉద్యమమే ఊపిరిగా
కదిలిన విద్యార్థి
సంఘాలు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాలు జిల్లా బంద్‌కు పిలుపునిచ్చాయి. ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, డివైఎఫ్ఐ, పిడిఎస్‌యు, పిడిఎస్ఒ వంటి విద్యార్థి సంఘాల నాయకత్వాలు ఉమ్మడిగా రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నరీతిలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్ర మను ఏర్పాటు చేయాలనే డిమాండ్ చేస్తున్నాయి. కేంద్రాన్ని నిలదీసి విభజన చట్టంలోని హక్కులన్నింటినీ సాధించుకోవాలని కోరుతున్నాయి. విద్యార్థి సంఘాలు మొదలుకుని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా నినదిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రానికి రావాల్సిన హక్కులను సాధించుకోవడంలో ఉమ్మడిగా వ్యవ హరించాలనే డిమాండ్ కొన్నేళ్లుగా వినిపిస్తోంది. కానీ రాష్ట్రంలోని పాలక, ప్రతిపక్షాలకు రాష్ట్రానికి రావాల్సిన హక్కుల సాధన కంటే వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి హక్కులను బలిపెడుతున్న వైనంలో అభ్యుదయ విద్యార్థి సంఘాల నాయకత్వాలు గళమెత్తాయి. ఇప్పటికే విద్యార్థి సంఘాలు యోగి వేమన యూనివర్శిటీలో బిఇడి సెకెండ్ సెమిష్టర్ పరీక్షను వాయిదా వేయాలనే అభ్యర్థన మేరకు వాయిదా వేయడం గమనార్హం. ఇటువంటి పరిస్థి తుల నేపథ్యంలో 2014, 2019లో అధికారం చేపట్టిన టిడిపి, వైసిపిలు తమ పాలనా కాలం ముగింపు దశలో నటించడం పరిపాటిగా మారింది. ఇటువంటి నిర్లక్ష్య పాలకులు ప్రయివేటు పారిశ్రామికవేత్తలను తీసుకొచ్చి శిలాఫలాకాలు వేయడం, వాటిని మరోచోటికి మార్చడం వంటి నటనలతో కాలం వెళ్లదీస్తున్న నేపథ్యంలో విద్యార్థి సంఘాలు జిల్లా బంద్‌ను తల పెట్టడం గమనార్హం. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు స్పందించి రాష్ట్రానికి ఇవ్వాల్సిన హామీలను అమలు చేయడం, ఇవ్వాల్సిన నిధులను ఇచ్చి రాష్ట్రాభివృద్ధి దోహద పడాల్సిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్రాల్లోని పాలకులు విఫలమైన సమయాల్లో విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు, మేధావులు స్పందించాల్సిన అవసరంలో భాగంగానే బంద్‌ను అర్థం చేసుకోవాల్సి ఉందని చెప్పవచ్చు.

హాస్టల్ వార్డెన్ తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

ఆమె భర్తపై చర్యలు తీసుకోవాలని ఆందోళన
ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి -ఖాజీపేట

స్థానిక మైదుకూరు రోడ్డులోని సాయిబాబా ఆలయం వెనుక ఉన్న బాలికల వసతి గృహ సంరక్షణ అధికారి బుజ్జీ మంగమ్మ తీరుపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె భర్త మూడే సుధాకర్ నాయక్ విద్యార్థినులస అసభ్యకర ప్రవర్తనపై మంగళవారం హాస్టల్ ఎదుట వారు ఆందోళన చేపట్టారు. వివరకు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజారాజేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. వార్డెన్ భర్త హాస్టల్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, వార్డె తీరుపై తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వసతి గృహం పరిసరాల్లో వార్డెన్ భర్త ఎందుకుంటున్నారని పోలీసుల ఎదుట తల్లిదండ్రులు నిలదీశారు. వసతి గృహాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏమాత్రం లేదని పేర్కొన్నారు. వసతి గృహంలో సిసి కెమెరాలు ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న మెనూ కూడా సక్రమంగా ఉండడం లేదని పేర్కొన్నారు. గతంలోనూ ఆయనపై పలు ఆరోపణలు వచ్చినా సంబంధిత అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోలేని వాపోయారు. మొక్కుబడిగా విచారించంఇ ఎటువంటి చర్యలు తీసుకోలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. వార్డెన్‌ను బదిలీ చేసి నూతన సంరక్షణ అధికారిని నియమించాలని కోరారు. ఇలాంటి చర్యలు చోటు చేసుకోకుండా జిల్లా ఉన్నతాధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల వార్డెన్ భర్త ప్రవర్తించిన తీరు పట్ల మైదుకూరు గ్రామీణ సిఐ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతుందన్నారు. వార్డెన్ భర్త సుధాకర్ నాయక్‌పై ఫోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. కడప రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మధుసూదన్ వసతిగృహానికి చేరుకొని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను విచారించారని తెలిపారు.



తల్లిదండ్రులను విచారిస్తున్న ఆర్‌డిఒ మధుసూదన్, ఎస్ఐ

ప్రతి విద్యార్థి ఎదగాలి : పిఒ

ప్రజాశక్తి-కడప సిటీ

ప్రతి విద్యార్థీ ప్రణాళికాబద్ధంగా ముం దుకు సాగాలని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్టెప్ సిఇఒ సాయి గ్రేస్‌తో కలిసి వేముల కస్తూర్బా విద్యార్థినులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ తరగతి గదిలోనే రూపు దిద్దుకుంటుందని చెప్పారు. ప్రతి విద్యార్థీ లక్ష్య నిర్దేశంతో చదవాలని, గురువు, తల్లిదండ్రుల పట్ల ప్రేమాభిమానాలు చూపాలని విద్యార్థులకు సూచించారు. మీరు చదివే పాఠశాలకు, ఉపాధ్యా యులకు, తల్లిదండ్రులకు, మీరు నివాసం ఉండే ప్రాంతానికి, సమాజానికి మంచి పేరు వచ్చే విధంగా చదవాలని విద్యార్థినులకు సూచించారు. రాబోవు పబ్లిక్ పరీక్షలు దృష్టిలో పెట్టుకొని ప్రణాళికాబద్ధంగా ఇప్పటి నుంచే చదవాలని విద్యార్థులకు సూచించారు. స్టెప్ సిఇఒ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విద్యా ర్థులు నిజ జీవితంలో రాణించాలంటే మార్కులు, గ్రేడ్లే ప్రామాణికం కాదని ఆసక్తి, సాధన, కృషి, తపన ఉంటే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొన్నారు. వ్యక్తిత్వాన్ని మనస్థత్వాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ శారద , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

రక్తదానం మరొకరి ప్రాణం నిలబెడుతుంది

ప్రజాశక్తి - కడప

రక్తదానం చేయడం అంటే ఓ మనిషికి జీవనదానం చేయడమే అని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్‌సిసి, రెడ్ క్రాస్ సొసైటీ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, కెజిబివిఎస్ వారి సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరాన్ని ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్. నీలయ్య, ప్రిన్సిపల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి అధికారి మాట్లాడుతూ మన దేశంలో 37 శాతం మంది మాత్రమే రక్తదానం చేయడానికి అర్హులన్నారు. వారిలో ప్రతి సంవత్సరమూ 10 శాతం కంటే తక్కువ మంది మాత్రమే రక్త దానం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల ందరూ రక్తదాన శిబిరాలలో పాల్గొనడంతో పాటు ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పించాలని అన్నా రు. కార్యక్రమంలో మహేష్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రత్యేక అధికారి శంకర్ రెడ్డి, సుధాకర్ , ఎన్‌వైకె అధికారి మణికంఠ, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నాగరాజు, శివరామకృష్ణ, అధ్యాపకులు రెడ్డి, బాషా, కృష్ణవేణి, లావణ్య, రాధిక, వెంకటశృతి, జె బి వి ఎస్ ఆర్గనైజర్ అశోక్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

జీవనశైలితో కేన్సర్ దూరం : విసి

కడప అర్బన్ : కేన్సర్ కారకాలను గుర్తించి అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఆరోగ్యకరమైన జీవన శైలి పాటిస్తే ఆ వ్యాధి నుంచి దూరంగా ఉండవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింత సుధాకర్ అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.ఎస్.సునీత, కెరీర్ గైడెన్స్ సెల్ డైరెక్టర్ కె. లలిత, మైనార్టీ సెల్ డైరెక్టర్ కె. రియాజున్నీసా ఆధ్వర్యంలో 'మహిళల ఆరోగ్య సమస్యల నివారణ' అనే అంశంపై అవగాహన కార్యక్రమం మంగళవారం సైన్స్ బ్లాక్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విసి ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ శరీరంలో ఉన్న కణాల అభివృద్ధిలో విపరీత పెరుగుదలే కేన్సర్‌కు కారకమన్నారు. మారుతున్న జీవనశైలి వల్ల కేన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. ప్రపంచంలో 1.4 నాలుగు బిలియన్ల కేన్సర్ బారిన పడుతున్నారంటే తీవ్రతను అర్థం చేసుకోవాలన్నారు.

శిశువుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

కడప : శిశువుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని, సకాలంలో వ్యాక్సినేషన్లు వేయించాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు తెలియజేశారు. అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎం. ప్రదీప్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం కడప నగరం కొండయ్య పల్లె లో గల గృహాన్ని, మోడల్ అంగన్వాడి ప్రీ స్కూల్ ను, రిమ్స్ ఆవరణలో గల నవజాత శిశు వార్డు లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే "శిశు రక్షణ దినోత్సవం" ను నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మాట్లాడుతూ శిశు రక్షణ దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు, శిశువుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి, సకాలంలో వ్యాక్సినేషన్లు వేయించాలి అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి మనోహర్, పారా లీగల్ వాలంటీర్లు ఎన్.దశరథరామిరెడ్డి, ఓ.దొరబాబు, తల్లిదండ్రులు, నవజాత శిశువులు పాల్గొన్నారు.

ఎపి దళిత ప్రజా సేవా సమితి నూతన కార్యవర్గం ఎన్నిక

కడప అర్బన్ : ఎపి దళిత ప్రజా సేవా సమితి నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు ప్రజా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పి.జి గంగయ్య తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎదురూరు బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కె. రెడ్డయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధిగా సిగ వెంకట సుబ్బయ్య, జిల్లా అధ్యక్షులుగా మాతంగి సుబ్బారాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా అట్లూరి సుబ్బారాయుడు, జిల్లా ఉపాధ్యక్షునిగా గిడుగునూరు గోపయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులుగా వరికుంట్ల సాయి కృష్ణ ను నియమించినట్లు తెలిపారు. మంగళవారం సమితి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ సేవా సమితి తరుపున దళితులు ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్యలైన పరిష్కరిస్తామన్నారు. ఏవైనా సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, భూములు, ఇంటి స్థలాలు విషయాలు, ఇతర సమస్యలు పరిష్కరించేందుకు తాము ఎప్పుడు ముందుంటామని చెప్పారు. దళితుల హక్కులను కాపాడేందుకు తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. దళితులు తమ సమస్యలు ఏవైనా వుంటే తమ దృష్టికి తేవాలని తెలియజేశారు. త్వరలో ఏపీ దళిత ప్రజా సేవా సమితి రాష్ట్ర సదస్సు నిర్వహిస్తూనట్లు పేర్కొన్నారు.

వైవీయూ బిఎడ్ పరీక్షలు తనిఖీ

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బిఈడి రెండో సెమిస్టర్ పరీక్షలను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి, విశ్వవిద్యాలయం హై పవర్ కమిటీ సభ్యులు ఆచార్య వై సుబ్బరాయుడు, డా. వి. వెంకట్రామ్ అకస్మికంగా తనిఖీ చేశారు. కడప నగరంలోని ఐదు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆచార్య ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్ రిజిస్టర్ ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య సూచనల మేరకు పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 6 నుంచి పరీక్షలు 13 కేంద్రాలలో ప్రారంభమయ్యాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9,963 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు.

ప్రజా రక్షణభేరిని విజయవంతం చేయాలి

కమలాపురం : ఈనెల 15న విజయవాడలో నిర్వహించబోయే ప్రజారక్షణ భేరిని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుల కామనూరు శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. మంగళశారం మండలంలోని సిపిఎం కార్యాలయంలో ప్రజారక్షణభేరి యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపికి కొమ్ముకాసే పార్టీలను వ్యతిరేకించి, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, నిర్బంధ విధానాలపై పోరాడాలని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి ఇక్కడి అధికార పక్షం వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనలు డూడూ బసవన్నల్లా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో సామాన్య మధ్య తరగతి ప్రజలు, కార్మికులు బతకలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం బలపరుస్తుందని విమర్శించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఎక్కడున్నారో సిఎం సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.రమేష్, సి. సుబ్బరాయుడు, ఎం రాజేష్ పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

- లేకపోతే ఆందోళన తప్పదు
- కలెక్టరేట్ వద్ద నిరసనలో అఖిలపక్ష రైతు సంఘాల నాయకుల హెచ్చరిక



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిఎం జిల్లా పర్యటనలో కరువు జిల్లాగా ప్రకటించాలని, లేనిపక్షంలో ఆందోళన తప్పదని అఖిలపక్ష రైతు సంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. జిల్లాలో కరువు మండలాలు ప్రకటించాలని మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆందోళనకు మద్దతుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి. శ్రీరాములు, అఖిలపక్ష రైతు సంఘం జిల్లా కార్యదర్శులు దస్తగిరి రెడ్డి, సుబ్బారెడ్డి, రమణ, శివారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కరువు మండలాల పట్ల ముఖ్యమంత్రికి, జిల్లా ప్రజా ప్రతినిధులకు ఏమాత్రం పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు మండలాలు ప్రకటించాలని ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలం చెందారని విమర్శించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి ఉండింటే కొంతవరకైనా కరువును నివారించవచ్చని పేర్కొన్నారు. కానీ పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఇవాళ జిల్లాలో కరువు విలయతాండం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ 103 కరువు మండలాలు ప్రకటిస్తే కడప జిల్లాలో ఒక్క కరువు మండలం కూడా ప్రకటించకపోవడం చాలా దుర్మార్గమని తెలిపారు. జిల్లాలో 36 మండలాలలో ఖరీఫ్ సీజన్ ముగిసేనాటికి తీవ్ర వర్షా భావ పరిస్థితులు నెలకొన్నాయని, వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయని వాపోయారు. జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి కరువు మండలాలను ప్రకటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులపై వేసిన పంటలు ఎందు దశకు చేరుకున్నాయని, సన్న, చిన్న కారు, మధ్యతరగతి రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రబీ సీజన్ ప్రారంభమైనది ఇప్పటివరకు వర్షమే కురవలేదని పంట పొలాలన్నీ బీడు భూములుగా ఉన్నాయని రబీ సీజనకు రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నా కూడా చినుకులు పడలేదని వారు తెలిపారు. కరువు కోరల్లో కడప జిల్లా చిక్కుకున్నదని రైతులకు భరోసా ఇచ్చే విధంగా జిల్లా ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు గ్రామాలలో పర్యటించాలని ఆయన కోరారు. ఎండిపోయిన పంటలకు తక్షణమే ఈ క్రాప్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో వలసల నివారణకు కరువు సహాయక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతాంగానికి పూర్తి నష్టపరిహారం చెల్లించాలని, మళ్లీ పంట వేసుకునేందుకు ఆర్థిక సాయం అందించాలని వారు కోరారు. కరువు కోరల్లో చిక్కిన రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జి చంద్ర, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ, బివిసిపి రాష్ట్ర కార్యదర్శి గురప్ప, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి రమణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు అన్వేష్, సుబ్రహ్మణ్యం, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు నాగ సుబ్బారెడ్డి, ఓబులేసు, సావంత్ సుధాకర్, మద్దిలేటి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, రైతు నాయకులు చిన్న సిద్ధయ్య, శ్రీనివాసుల రెడ్డి, మహిళా సంఘం నాయకులు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఈ నెల 9, 10 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారని అధికారులందరూ బాధ్యతగా తమకు అప్పగించిన విధులు నిర్వహించాలని కలెక్టర్ విజయ్‌రామరాజు పేర్కొన్నారు. మంగళవారం పులివెందులలోని బాకరాపురం హెలిప్యాడ్, శ్రీకృష్ణ దేవాలయం, ఎపి సిఎఆర్ఎల్ ఆవరణలోని ఆదిత్య బిర్లా టెక్స్ టైల్స్, వ్యవసాయ, ఉద్యాన కళాశాల, శిల్పారామం ప్రాంగణాలను ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్, జెసి గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని, తాగు నీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. భద్రతా, పార్కింగ్ అంశాలలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాడా ఒఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డి, పులివెందుల ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, పోలీసు, ఫైర్ అధికారులు, మున్సిపల్, విద్యుత్, ఆర్అండ్ బి, పిఆర్ శాఖల ఇంజినీర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సిఎం పర్యటన పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ఉక్కాయపల్లి డంపింగ్ యార్డ్‌ను మార్చాలి

కడప అర్బన్ : ప్రజా ఆరోగ్యాలకు హానికరంగా ఉన్న ఉక్కయిపల్లి డంపింగ్ యార్డ్‌ను మార్చాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి. ఎం. ఓబులేసు డిమాండ్ చేశారు. మంగళవారం ఉక్కాయపల్లి డంపింగ్ యార్డ్‌ను డివైఎఫ్ఐ నాయకులు యూసఫ్, ఉదయ్, బాషా లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న ఉక్కాయ పల్లి డంపింగ్ యాడ్‌ను అభివృద్ధి పేరుతో పార్కును ఏర్పాటు చేశారని, ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పక్కనే మళ్లీ డంపింగ్ యార్డ్‌ను పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఉక్కాయపల్లి, కొండాయపల్లి, శంకరాపురం, మాసాపేట ప్రాంతాల ప్రజలు పార్కు వస్తే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే ప్రజలు విష జ్వరాలతో అల్లాడుతున్న నేపథ్యంలో మరోవైపు డంపింగ్ యార్డ్‌లోని దుర్వాసన చుట్టుప్రక్కలు ఉన్న ఇళ్లకు ఆయా ప్రాంతాల ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉందన్నారు. తక్షణమే కమిషనర్ స్పందించి డంపింగ్ యార్డ్‌లో ప్రజలకు ఆటంకం లేని ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అర్జీదారులకు రశీదు ఇవ్వాలి

కాశినాయన : అర్జీదారుల వినతులు స్వీకరించి వారికి రశీదు ఇవ్వాలని ఎంపిడిఒ మైథిలీ పేర్కొన్నారు. మంగళవారం ఆమె వెలుగు, ఉపాధి సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఈనెల 8న మండలానికి జిల్లా అధికారి వస్తున్నారని, అర్జీదారుల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఎలాంటి పొరపాట్లు జరిగినా సహించే ప్రసక్తే లేదని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సహకరించి వారి వారి శాఖ తరపున ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి : డిసిసి

ప్రజాశక్తి - కడప

సాగుచేసిన పంటలు వర్షాభావం వల్ల ఎండు దశకు చేరుకుంటున్నా యని, ఈ పరిస్థి తులను ప్రభుత్వం గమనించి ఒక కమిటీ వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాముడు అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సరాసరి వర్షపాతం జూన్ నుంచి అక్టోబర్ వరకు (-)34 వరకు ఉందన్నారు. ప్రభుత్వం జీవో నెంబర్ 4 ద్వారా 103 మండలాలు మాత్రమే కరువు ప్రాం తాలుగా ప్రకటించి కడప జిల్లాను విస్మరించిందని పేర్కొన్నారు. తక్షణమే కడప జిల్లాలోని 36 మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులపై వైసిపి మరో కొత్త నాటకానికి తెరదేసిందన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా కాంగ్రెస్ హయాంలోనే ఎదిగారని తెలిపారు. ఈనెల 8న రైతులు, ప్రజా సమస్యలపై ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహి స్తున్నామని చెప్పారు. సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు విష్ణుప్రితమ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామలమ్మ, నగర మహిళ అధ్యక్షులు లావణ్య పాల్గొన్నారు. **'గుండ్లకుంట'కు సన్మానం ..** ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులుగా నియమితులైన గుండ్లకుంట శ్రీరాములను మంగళవారం ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు టి.వెంకటేశ్వరరావు, పి.ఆర్.వి. ప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు గుండ్లకుంట శ్రీరాములను శాలువా, పూలమాలతో సత్కరించి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో ముదిరాజ్ సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఇందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



డిసిసి అధ్యక్షుడిని సన్మానిస్తున్న ముదిరాజ్ సంక్షేమ సంఘం నాయకులు

కమిషనర్ దృష్టికి రోడ్ల విస్తరణ సమస్యలు

కడప : నగరంలో చేపట్టిన రోడ్ల విస్తరణకు సంబంధించిన పలు సమస్యలను కడప కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ దృష్టికి మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ తీసుకువెళ్లారు. స్థానిక కాగితాల పెంట , నబి కోట ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన కమిషనర్‌తో మాట్లాడుతూ స్థానికంగా ఉన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా రోడ్ల విస్తరణ చేపట్టిన ప్రాంతాల్లో తొలగించిన శిథిలాలను వెంటనే తొలగించాలని కోరారు. స్థానిక కాగితాల పెంటలో ఉన్న హజరత్ పీర్ ఓ మురుషద్ సయ్యద్ రసూల్ షావలి దర్గా కు అనుసంధానంగా ఉన్న రూమును తొలగించ రాదని కోరారు. దర్గాకు సదరు రూము తొలగిస్తే ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు . రోడ్డు విస్తరణ సమయంలో దర్గా కట్టడాలు దెబ్బతినకుండా కాపాడాలని కోరారు. భవనాలు కోల్పోయిన వారికి వెంటనే పరిహారం మంజూరు చేయాలని కోరారు. అనంతరం కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ స్పందిస్తూ అన్ని చర్యలు చేపడుతున్నామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రవీంద్ర నగర్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు హమీద్ సిపిఐ నగర సమితి సభ్యుడు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

కలసపాడు : విద్యార్థులందరూ గొప్ప స్థాయికి చేరాలంటే పట్టుదల, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ ఎంతో అవసరమని హోలీ రోజరి పాఠశాల ప్రిన్సిపల్ సగిలి జైపాల్ అన్నారు. మంగళవారం ఆయన విద్యార్థుల క్రీడా స్ఫూర్తిపై మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ చదువుతోపాటు ఆటలు కూడా ఎంతో అవసరమని చెప్పారు. విద్యార్థులు సృజనాత్మక శక్తి పెంపొందించాలంటే వ్యాయామం తప్పనిసరిని పేర్కొన్నారు. ఈనెల 2న నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ ఆఫ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్- 14 వాలీబాల్ క్రీడలో హోలీ రోజరీ పాఠశాల విద్యార్థి గడికోట అభిషేక్ తన సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని అభినందనించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వై .గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ పర్యటన వాయిదా

కాశినాయన : ఈనెల 9న సిఎం జిల్లా పర్యటన సందర్భంగా మండలంలో కలెక్టర్ కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంపిడిఒ మైథిలీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి కార్యక్రమం ఎప్పుడు ఉంటుందో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తెలియజేస్తామన్నారు.

గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

రిమ్స్ సమీపంలో దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత యునాని మెడికల్ సెంటర్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్ష ణీయమని ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కడపలోని రిమ్స్ వద్ద యునాని మెడికల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు కేటాయించిన 25 ఎకరాల స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు విషయంలో కలెక్టర్ చొరవ చూపాలని కోరారు. యునాని మెడికల్ అండ్ రీసెర్చ్ సెంటర్ సాధనలో తమ వంతు సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలి పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, నగర ప్రముఖులు ఇఫ్తికార్ జమాల్, ఆప్‌కి అవాజ్ రాష్ట్ర కార్యదర్శి పాల్గొన్నారు.



మెడికల్ రీసెర్చ్ సెంటర్ స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఇంటి వద్దకే పశువైద్య సేవలు

ప్రజాశక్తి - ముద్దనూరు

పశువులకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 1962 నంబరుకు ఫోన్ చేస్తే పశు సంచార వాహనం ద్వారా పశువులకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందిస్తుందని మండల పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస తెలిపారు. మండలంలోని కొత్త చౌటిపల్లి గ్రామంలో మంగళవారం వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాలకు సకాలంలో నులిపురుగులు, నట్టల నివారణ మందు తాగించడం వల్ల అవి వ్యాధి బారిన పడకుండా నిరోధకశక్తిని పెంచుకుంటాయన్నారు. వ్యాధి బారిన పడిన జీవాలను పాడిపశువులను ఆయా గ్రామాల్లోని పశు వైదశాలలో చికిత్స చేయించాలన్నారు. పశువులను వైద్యశాలకు తేలేని పరిస్థితుల్లో 1962 నెంబరుకు ఫోను చేస్తే రైతు ఇంటి వద్దకే సంచార పశు వైద్య వాహనం వచ్చి జీవాలకు వైద్యం అందించనున్నట్లు చెప్పారు. పాడి రైతులు, గొర్రెలు, మేకల యజమానులకు టీకాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో జెవిఒ శకుంతలమ్మ, గోపాలమిత్ర శివలింగేశ్వరరెడ్డి, సిబ్బంది వీరేంద్ర, మేరీ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో 10 టివి విలేకరి శివ కేశవరెడ్డి అన్నదానం చేశారు. మంగళవారం శివకేశవరెడ్డి తండ్రి బండ్లపల్లె పుల్లారెడ్డి రెండవ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. తన వంతు ఆశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో శివకేశవరెడ్డి కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నేషనల్ సర్వీస్ స్కీం ఆధ్వర్యంలో శ్రీదీప బ్లడ్ బ్యాంకు సహకారంతో బీటెక్, ఎంబీఏ విద్యార్థులకు రక్తదాన శిబిరం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలను నిలబెట్టిన వారమవుతామని తెలిపారు. దీప బ్లడ్ బ్యాంకుకు చెందిన డాక్టర్ ఎం సాయిగిరిధర్ మాట్లాడుతూ ఎస్ఆర్ఐటి కళాశాలలో విద్యార్థులు 125 మంది రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. కళాశాల కరస్పాండెంట్ వీర కళ్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఎంతో గొప్ప మనసుతో రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ వెంకటేశ్వరరెడ్డి,అకడమిక్ డీన్ డాక్టర్ వై సుబ్బారెడ్డి, హెచ్వోడీలు, పీడీ చరణ్ రెడ్డి, ఏవో జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌కు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కడప ఉక్కు పరిశ్రమ సాధనకు, విశాఖ ఉక్కు ఉద్యమానికి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో విశాఖ ఉక్కు పరిరక్షణకోసం తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి విజయ్, గోపాలదాస్, ఏసుదాసు కోరారు. మంగళవారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేటు వారికి కారుచౌకగా అప్పగించాలని చూస్తోందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజు, నరేంద్ర, దివాకర్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : కడప పరిశ్రమ కోసం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపడం కోసం రేపటి భవిష్యత్ మార్చడం కోసం నేడు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మంగళవారం సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినయ్‌కుమార్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం అమ్మేందుకు, కడప ఉక్కు రాకుండా మోసం చేస్తోందని విమర్శించారు. బంద్‌లో విద్యార్థులు, యువకులు, మేధావులు, కార్మికులు, రైతులు, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : విశాఖ ఉక్కు కోసం రాయలసీమలో కడప ఉక్కు నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాపరెడ్డి, పిడిఎస్ఓ రాయలసీమ కన్వీనర్ కత్తి ఓబులేసు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఇందుకు పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలన్నారు.

ఓటర్ల జాబితా తయారీలో నిబద్ధత ఉండాలి

జమ్మలమడుగు రూరల్ : ప్రతి అధికారి ఓటర్ల జాబితా తయారీలో నిబద్ధతతో తయారు చేయలని ఆర్‌డిఒ జి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళ వారం రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటరు జాబితా తయా రవుతోందని, త్వరలోనే మీకు అందిస్తామని తెలిపారు. ఇందులో సవ రణలు, ఎలాంటి అవకతవకలున్నా తమ దృష్టికి తీసుకురావలన్నారు. బిఎల్‌వోలు కచ్చితంగా పోలింగ్ కేంద్రాలలో డబల్ ఎంట్రీపై అవగాహన కలిగి ఉండి వాటిని సవరించాలన్నారు. పేర్లు తప్పులున్నా సవరించుకునేందుకు అవ కాశం కల్పించాలన్నారు. ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ షఫీ, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ వలి, వేణు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సర్ సివి రామన్ జయంతి

ప్రొద్దుటూరు : భారతరత్న సర్ సివి రామన్ జయంతి వేడుకలను గీతాంజలి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివరామిరెడ్డి మాట్లాడుతూ సివి రామన్‌గా పిలువబడే చంద్రశేఖర వెంకట్రామన్ 1888 నవంబర్ 7న జన్మించారన్నారు. ఆయన భౌతిక శాస్త్రవేత్త అన్నారు. 1930లో నోబల్ బహుమతి వచ్చిందని తెలిపారు.

క్రైం కార్నర్

యువకుడు దారుణ హత్య

ప్రజాశక్తి - చెన్నూరు



హత్యకు గురైన ప్రణయ్‌కుమార్

చెన్నూరు కొత్త రోడ్డు జాతీయ రహదారిలో సోమవారం రాత్రి దారుణ హత్య జరిగింది. ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజీపేట మండలం చెముళ్లపల్లె పంచాయతీ బాలానగర్‌కు చెందిన ప్రణయ్ కుమార్(26) చెన్నూరులోని తన స్నేహితులు కలిసి మద్యం సేవించి, ఆ సమయంలో స్నేహితులతో మద్యం మత్తులో గొడవలకు దిగడంతో ప్రణయ్‌కుమార్ తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. ఘర్షణకు దిగి తన స్నేహితులు వెంబడించి కొత్త రోడ్డులో అతనిపై కత్తులతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే వీరి మధ్య పాత కక్షలు ఉన్నాయా, మత్తులో హత్యకు పాల్పడ్డారా అనే విషయాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. శవ పరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలోని చెముళ్లపల్లి పంచాయతీ బాలానగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఈరి జోనస్ కుమారుడు ఈరి ప్రణయ్ కుమార్(26) సోమవారం రాత్రి చెన్నూరు కొత్తరోడ్డులో దారుణంగా హత్యకు గురయ్యారు. విషయం తెలిసి కడప రిమ్స్ ఆసుపత్రి మార్చురీలో ఈరి ప్రణయ్‌కుమార్ మృతదేహాన్ని మంగళవారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక మాజీ కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, సీనియర్‌నేత రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తప రిచారు. ప్రణయ్ తండ్రి ఈరి జోనస్ వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సం ఘటనపై కడప డిఎస్‌పి షరీఫ్‌తో చర్చించి కఠిన చర్యలు తీసుకోవాలని రెడ్యం కోరారు.

సామాన్యుడి జీవితం సతమతం

కరువు, జ్వరాలు, నిత్యావసర ధరలు పెరుగుదల - సమస్యలు గాలికి వదిలి టూర్లలో బిజీగా రాజకీయ నేతలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వరుణుడి కరుణ లేక కరువు, దోమలతో జ్వరాలు, పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో సామాన్యుడి జీవితం సతమతమవుతోంది. వారి జీవనం చాలా కష్టంగా మారింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అటు రైతులు, ఇటు కూలీలు అల్లాడిపోతున్నారు. ప్రజా సమస్యలను రాజకీయ నేతలు పట్టించుకోవడంలేదు. తమ ఉనికి కోసం యాత్రల పేరుతో బిజీగా ఉన్నారు. కరువు పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దీనిపై స్పందించాల్సిన పాలకపక్షం యాత్ర పేరుతో పార్టీ ప్రయోజనాల కోసం పాటుపడుతుందే తప్ప, ఆ సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. టూర్లల్లో ఒకరిపై ఒకరు విమర్శించుకుంటానరే కానీ జిల్లాలో నెలకొన్న కరువు, ధరల పెరుగుదలపై ఎవరూ మాట్లాడటం లేదు. వామపక్ష పార్టీల నేతలు మాత్రం ప్రజల పక్షాన నిలబడి అధికార పార్టీ, ప్రతి పక్షాల తీరును ఎండగడుతూ ప్రజా రక్షణభేరి సభలలో సమస్యలపై గళం ఇప్పుతూ ప్రజల్లో చైతన్యాన్ని నింపుతున్నారు.

వర్షాభావంతో కరువు దరువు

వర్షాలు రాకపోవడంతో పంటలు ఎండిపోయి కరువు పరిస్థితులు నెలకొన్నాయి. పంటలు ఎండి కనీసం కోతకు కూడా పనికిరాని పరిస్థితి ఏర్పడింది. పశువులకు మేత దొరకడంలేదు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా కరువు పరిస్థితులపై జిల్లా అధికారులుగానీ, జిల్లాలోని ప్రజా ప్రతినిధులుగానీ పట్టించుకోకపోవడంతో.. జిల్లాలో ఒక్క మండలం కూడా కరువుగా ప్రకటించ లేదు. దీన్నిబట్టి అధికారులు, ప్రజాప్రతినిధుల పనితీరు ఏ విధంగా ఉందో తెలుస్తోంది.

జ్వరాలతో అల్లాడుతున్న జనం

టైఫాయిడ్, డెంగీ వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. అటు పనుల్లేక, ఇటు ఆస్పత్రి వెళ్లేందుకు డబ్బుల్లేక సామాన్యులు అల్లాడిపోతున్నారు. వైరల్ జ్వరాలు సోకిన వారు జ్వరం తగ్గినా తీవ్ర నీరసంతో ఇబ్బంది పడుతున్నారు. ఇక డెంగీ నిర్ధారణ పరీక్షలకు సమయం పడుతుండడంతో పరిస్థితి దారుణంగా ఉంటోంది. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది తలమునకలవుతోంది. తద్వారా వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది ఆరోగ్య కేంద్రాలలో పరిమితంగానే ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో రోగులు ప్రయివేట్ వైద్యులను సంప్రదిస్తున్నారు.



ప్రజా సమస్యలపై మైదుకూరులో బస్సుయాత్ర నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు (ఫైల్ ఫోటో)

బాధితులకు ఖర్చు తడిసి మోపెడవుతోంది. ప్రజలందరికీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని, మెరుగైన చికిత్స అందించామని పదేపదే గొప్పలు చెప్పుకుంటున్న ప్రజాప్రతినిధులు డెంగీ, టైఫాయిడ్, వైరల్ జ్వరాల నియంత్రణకు, బాదితులకు చికిత్స అందించేందుకు తీసుకుంటున్న చర్యలపై మాత్రం నోరు మెదపకపోవడం గమనార్హం.

రాజకీయ నాయకులు యాత్రల్లో బిజీ

వైసిపి సామాజిక సాధికార యాత్ర, టిడిపి నువ్వే మా భవిష్యత్, న్యాయం గెలవాలి, జనసేన వారాహి యాత్ర అంటూ రాజకీయ నాయకులు బిజీగా ఉంటున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు, జనసేన యాత్రలు చేసుకుంటూ ఒకరిపై ఒక విమర్శించుకున్నారే తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోలేదు. కానీ ప్రజారక్షణ భేరితో సిపిఎం నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సభలు పెడుతున్నారు. వీరికి ప్రజల మద్దతు లభిస్తోంది. ప్రజలను చైతన్యవంతులను చేసి అధికార పార్టీ, ప్రతిపక్షాల పైన ఒత్తిడి తేవడానికి తీవ్రంగా కృషి చేస్తోంది. ఇప్పటికైనా ఆర్భాటపు ప్రచారం మానుకుని జిల్లాలో అలుముకున్న కరువు, పెరుగుతున్న ధరలు, జ్వరాలపై అధికార పక్షం, అధికార యంత్రాంగం దృష్టి పెట్టి అవసరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే రానున్న రోజుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురై అధికారులు, నాయకులపై తిరగబడే పరిస్థితి రావచ్చు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - ముద్దనూరు



సర్పంచ్ జయరాం నాయుడు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందించి అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్నారని మాదన్నగారిపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ వైకుంఠం జయరాం నాయుడు అన్నారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ జగనన్న పార్టీలకు కుల మతాలకు అతీతంగా పారదర్శకంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందన్నారు. ప్రతి ఇంటికి లబ్ధి చేకూరేలా జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పాదయాత్రలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసినట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని జగన్ నిరూపించారన్నారు. సిఎం, ఎంపీ అవినాష్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. మాదన్నగారిపల్లె గ్రామ పంచాయతీలోని కాండ్లోపల్లె, కోనాపురం, మాదన్నగారిపల్లె గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. గ్రామ, ప్రజలకు అవసరమైన వసతులు కల్పించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నానన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా ప్రజలు తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని ఆయన కోరారు. వైసిపి బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని జయరాం నాయుడు తెలిపారు.

సిఎంచే పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



ప్రారంభానికి ముస్తాబైన శిల్పారామం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రెండు రోజుల కడప జిల్లా పర్యటనలో భాగంగా ఈనెల 9, 10 తేదీల్లో పులివెందులకు రానున్నారు. 9న అన్నమయ్య జిల్లా పర్యటన అనంతరం పులివెందులకు చేరుకుంటారు. అదేరోజు ముఖ్యమంత్రి పట్టణంలో సుమారు రూ.47.24 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అలాగే రూ.14.4కోట్లతో శిల్పారామంలో చేపట్టిన పనులను ప్రారంభిస్తారు. రూ.5కోట్లతో నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయాన్ని ఆయన ప్రారంభించనున్నారు. అనంతరం ఐవి ఆర్‌సి ఎల్‌లో రూ.12 కోట్ల రూపాయలతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన శాఖ యూనివర్సిటీని ప్రారంభోత్సవం చేయనున్నారు. ఇడుపులపాయలో రూ.1.25 కోట్లతో ఆర్కే వ్యాలీలో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను, అనంతరం అదే ప్రాంతంలో ఢిల్లీ ప్రైవేట్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రూ.15 కోట్లతో నిర్మించనున్న నారాయణస్వామి గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను, ముఖ్యమంత్రి ప్రారంభించే పలు అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ పర్యటించి, అన్ని ఏర్పాటను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

త్వరలో బిసి రథయాత్ర : గురుమూర్తి యాదవ్



మాట్లాడుతున్న గురుమూర్తి యాదవ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం త్వరలో రథయాత్ర చేపట్టబోతున్నామని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నెలూరు గురుమూర్తి యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సమావేశం విశాఖపట్నంలో జరిగిందన్నారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కుమారస్వామి ఆధ్వర్యంలో వైజాగ్‌లోని ద్వారకా నగర్ పబ్లిక్ లైబ్రరీ హాల్‌లో నిర్వహించారన్నారు. బిసిలందరూ ఏకమై వారికి రాజ్యాధికార సాధన కోసం మరో స్వతంత్ర పోరాట యాత్ర శ్రీకాకుళం నుండి తిరుపతి వరకు వందకుపైగా నియోజకవర్గాలను కలుపుకొని చేయబోతున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి రాజకీయ పోటీలు 90 అసెంబ్లీ, 12 పార్లమెంటు స్థానాలు కేటాయించాలన్నారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు, మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ, ఆవుల నరసింహులు, సోమ నాయుడు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జాతీయ బిసి సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారన్నారు.

అసమానతల్లేని అభివృద్ధికి పోరాడుతాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా బస్సు జాతా నిర్వహిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.మనోహర్ తెలిపారు. జమ్మలమడుగులో మైలవరం సిపిఎం కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ ఈనెల 15న విజయవాడలో గొప్ప బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్లు పూర్తి కావస్తోందని, ప్రత్యేక హెూదా, పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ వంటి విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రజల్ని నిలువునా మోసం చేసిన బిజెపి.. అంతటితో ఆగకుండా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గుండెకాయ వంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి తయారైందని విమర్శించారు. రాష్ట్రంలో కరువుఛాయలు తీవ్రస్థాయిలో ఉన్నాయన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో కూడా అరకొర మాత్రమే ఉన్నాయన్నారు. తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించకపోగా పార్లమెంట్‌లో బిజెపిని బలపరుస్తోందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని పోర్టుల్ని ఆదానీ పరం చేసినా, విద్యుత్ ఛార్జీలను భారీగా వడ్డిస్తున్నా, ఉద్యోగుల పెన్షన్‌కు ఎసరు పెట్టినా చంద్రబాబు నోరువిప్పడం లేదన్నారు. ఈనెల 15న జరిగే బహిరంగ సభకు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొండయ్య , లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **చాపాడు :** దేశంలో, రాష్ట్రంలో బిజెపి, వైసిపి ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ అసమానతలు లేని అభివృద్ధి కావాలని కోరుతూ.. లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్ర రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో జరుగుతుందని, బస్సు యాత్ర ముగింపు బహిరంగ సభ ఈనెల 15న విజయవాడలో జరగనుందని దీన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ కోరారు. మంగళవారం మైదుకూరులోని సుందరయ్య నగర్‌లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మహాసభ గోడపత్రాలు, స్టిక్కర్లు, కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, మండల కమిటీ సభ్యులు గురవయ్య, ఓబయ్య, నాయకులు పోలయ్య, బాలరాజు, సుధాకర్, ఇమామ్, లక్ష్మీదేవి, మేరీ, రాహుల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మనోహర్

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని చిలమకూరు, తిప్పలూరు ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ఫేస్-2 పనులను మంగళవారం రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ ప్రాజెక్ట్ మానిటరింగ్ అధికారి బుగ్గయ్య పరిశీలించారు. పనుల నాణ్యత ప్రమాణాలను, పనుల రికార్డులను పరిశీలించారు. పనులను తొందరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఇఇ చంద్రశేఖర్, డిఇ సుధాకర్‌రెడ్డి, ఎంఇఒ శివప్రసాద్, మండల ఇంజనీర్ రామాంజనేయులురెడ్డి, సాంబశివయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌టియు మండల శాఖ అధ్యక్షులుగా జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

ఎస్‌టియు చక్రాయపేట మండలశాఖను మంగళవారం ఎన్నుకున్నారు. వేంపల్లెలో జరిగిన రీజియన్ సమావేశంలో మండల అధ్యక్షుడిగా ఎం.జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.కుళాయి బాబు, ఆర్థిక కార్యదర్శిగా గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా జి.శివారెడ్డి, ఎస్.దాదాపీర్, డి.ధర్మారెడ్డి, పి.రామమోహన్‌రెడ్డి, ఎస్.అమీర్‌బాషా, ఎం.సుబ్రమణ్యం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

11న ఆర్‌టిడిలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మైదుకూరు రోడ్డులోని రాణీ తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో ఈ నెల 11న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. క్యాప్, క్యూసి, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్‌లలో ఉద్యోగాల కోసం బిఎస్సీ కెమిస్ట్రీ, బికాం, బిఏ, ఎమ్మెసీ, బి ఫార్మసీ, ఐఐటీ ఫిట్టర్, మెకానికల్ విభాగాలలో 2020, 2021, 22, 23 పాసైన వారు అర్హులని వివరించారు. ఆసక్తి, అర్హతగల వారు కళాశాల ప్రాంగణంలో 11న ఉదయం 9.30 గంటలకు ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్యం సమాజానికి ప్రాణసమానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజాస్వామ్యం, లౌకికత్వం సమాజానికి ప్రాణసమానమని గౌతం ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చిన్నమునిస్వామి నాయుడు అన్నారు. జనవిజ్ఞానవేదిక (జెవివి) ఆధ్వర్యంలో మంగళవారం శాస్త్రీయ దృక్పథ జాతీయ ప్రచార ప్రారంభ సమావేశం గౌతమ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథ ప్రచారం భారత దేశం అంతటా ఈనెల 7 నుంచి ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందన్నారు. ఈ ప్రచారంలో భాగంగ 'ప్రజాస్వామ్యం కోసం సైన్స్-లౌకికత్వం కోసం సైన్స్' అనే అంశాలపై అనేక సైన్స్ సంస్థలు దేశవ్యాప్త ప్రచారం చేస్తాయన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా అధ్యక్షులు పోలంకి శ్రీరాములు మాట్లాడుతూ మనిషికి ప్రశ్నించడం, ఆలోచించడం ఎంతో అవసరమన్నారు. శాస్త్రీయ దృక్పథ దేశంలో పరిఢవిల్లాలంటే ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సుధీర్, జిల్లా నాయకులు డాక్టర్ మురుకూటి సూర్యనారాయణరెడ్డి, నంగా రాజేష్, ఆశ్రిత్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో జెవివి నాయకులు

టపాసుల విక్రయంలో జాగ్రత్తలు పాటించండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

టపాసుల దుకాణాల యజమానులు తగు జాగ్రత్తలు పాటించి విక్రయాలు జరపాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన తన చాంబర్‌లో టపాసుల విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల మధ్య ఖాళీ స్థలం ఉండేలా చూసుకోవాలన్నారు. దుకాణంలో ఇసుక నింపిన బకెట్లు, నీటి బకెట్లు ఉంచుకోవాలని సూచించారు. ప్రథమచికిత్స పెట్టెను ఏర్పాటు చేయాలని తెలిపారు. నిబంధనల ప్రకారం విక్రయాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

దుకాణాలకు 6 దరఖాస్తులు

సింహాద్రిపురం : దీపావళి సందర్భంగా మండల కేంద్రమైన సింహాద్రిపురంలో టపాసుల దుకాణాలు ఏర్పాటుకు ఆరు మంది దరఖాస్తు చేసినట్లు మంగళవారం తహశీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. టపాసుల దుకాణ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కార్తీక మాసంలో ప్రతి సోమవారం శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డిఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ యాగంటి, మహానంది, నందవరం, రామేశ్వరం, కన్నతీర్థంనకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు వేసినట్లు తెలిపారు. పెద్దలకు రూ.550, పిల్లలకు రూ.300 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రిజర్వేషన్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. శబరిమల యాత్రకు అయ్యప్ప భక్తులకు బస్సులు అద్దెకిచ్చుటకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కిలోమీటర్ బాడుగ రూ.62కాగా, అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం రూ.57 తగ్గించామన్నారు.

10న డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ఆర్టీసీ డిపోకు సంబంధించి సమస్యలను ప్రయాణికుల నుంచి తెలుసుకుని పరిష్కరించేందుకు శుక్రవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యను 99592 25781 నం బర్‌కు ఉదయం 11 నుంచి 12 గంటలకు వరకు ఫోన్ చేసి చెప్పవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిఎం కోరారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత ఎపిఎస్ ఆర్‌టిసిలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగిపై ఉందని జమ్మలమడుగు డిపో మేనేజర్ పివి ప్రవీణ్ తెలిపారు. జమ్మలమడుగు డిపో ఉద్యోగులతో మంగళవారం ఆయన సమావేశం ఏర్పాటు చేసి, బస్సులను స్వయంగా తనిఖీ చేశారు. బస్సుల కండీషన్ గురించి గ్యారేజ్ కార్మికులను అడిగి తెలుసుకున్నారు. బస్సులను కండీషన్‌లో ఉంచాలన్నారు. ఏమైనా పరికరాలు అవసరమైతే తన దృష్టికి తేవాలన్నారు. డ్రైవర్లు బస్సు తీసుకొని వెళ్లేటప్పుడు బ్రేక్, స్టీరింగ్, క్లచ్ తప్పనిసరిగా చెక్ చేసుకోవాలన్నారు. సమావేశంలో గ్యారేజ్ ఇన్‌ఛార్జి కంబగిరి స్వామి, డ్రైవర్లు, ఉద్యోగస్తులు, గ్యారేజ్ కార్మికులు పాల్గొన్నారు.

జగన్ పాలనంతా అరాచకమే

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల జగన్ పాలనంతా అరాచకమేనని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఆధ్వర్యంలో టి.వెలమవారిపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టోకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం ఆరాచక పాలన కొనసాగుతోందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమంగా కేసులు పెట్టడం, బెదిరింపులకు పాల్పడడమే జరుగుతోందన్నారు. చంద్రబాబు రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. మీ బిడ్డల భవిష్యత్ బాగుండాలంటే రానున్న ఎన్నికల్లో చంద్రబాబును సిఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, పార్లమెంటు ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, పాపిరెడ్డి, డక్కా రమేష్, నాగభూషణంరెడ్డి, మడక శ్రీనివాసులుతోపాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలి

ప్రొద్దుటూరు : వసతిగృహాల్లో చదివే పేద విద్యార్థులకు ప్రభుత్వం మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని రెవెల్యూషనరీ విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి కడప జిల్లాలోని 10 నియోజకవర్గాలు కలుపుతూ ఆర్ఎస్‌యు జీపు జాతాలో భాగంగా మంగళవారం స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు.